క్లుప్తంగా

21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

విజయవాడ కల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ, ఆంధ్ర లయోలా కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 21న లయోలా కళాశాల ఆవరణలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు అకాడమీ కార్యదర్శి కే శ్రీనివాస రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగే ప్రారంభ సభలో సాహితీవేత్త పాపినేని శివశంకర్, లయోలా కళాశాల ఫాదర్ జీఏపీ కిషోర్, కోలా శేఖర్ పాల్గొంటారు. మాతృభాషా పరిరక్షణ అంశంగా జరిగే సదస్సుకు గారపాటి ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు. అనంతరం జరిగే బహుభాషా సమ్మేళనంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు స్వీయకవితా గానం చేస్తారని తెలిపారు.

బొండా ఉమాపై చర్యలు తీసుకోండి

సీపీ రాణాకు వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఫిర్యాదు



విజయవాడస్పోర్ట్స్: వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుపై పదేపదే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమాపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు విజయవాడలోని పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్ కమిషనర్ టి.కె.రాణాను శనివారం కలిసి ఫిర్యాదు చేశారు. బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్న బొండా ఉమాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జోన్ ఇన్‌చార్జ్ ఒగ్గు గవాస్కర్, న్యాయవాదులు వెంకటేష్‌శర్మ, అబ్రహాం లింకన్, పిల్ల రవి, సాయిరాం, విఠల్‌రావుమౌళి, ప్రభాకర్, సౌమ్య, జ్యోతి, రాజేష్, రాంబాబు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

యూజీడీ సంపు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): యూజీడీ సంపు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీ జానారెడ్డి సూచించారు. స్థానిక 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్ ఆచంట వెంకటరత్నంనాయుడు సర్కిల్‌లో నిర్మిస్తున్న యూజీడీ సంపు నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. యూజీడీని సాధ్యమైనంత త్వరలోనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

దాసాంజనేయుడికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

భారతీయ నృత్య సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి



విజయవాడ కల్చరల్: భారతీయ నృత్య సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని సంస్కార భారతి సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ సూచించారు. భరతముని జయంతి సందర్భంగా సంస్కార భారతి, సుమధుర కళానికేతన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించే రాష్ట్రస్థాయి శాస్త్రీయ నృత్య పోటీలను గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళా వేదిక మీద శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలోని ప్రతిభను గుర్తించి వారికి వేదిక కల్పించడానికి సంస్కార భారతి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు కూచిపూడి, భరతనాట్యం, జానపద అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం జరిగే కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. సంస్థ క్రియాశీలక బాధ్యుడు సాయిశంకర్ మాట్లాడుతూ కౌతా పూర్ణానందం కళా వేదిక తోపాటు, ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాల, అయోధ్య నగర్‌లోని హైందవిలో కళాకారుల సౌలభ్యం మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్కార భారతి ప్రాంత కార్యదర్శి దర్భా శ్రీనివాస్ 100 మంది చిన్నారులతో సోలో అంశాలను ప్రదర్శించారు. నిర్వాహకులు వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. న్యాయనిర్ణేతలుగా భాగవతుల వెంకట్రామశర్మ, ఉమామహేశ్వర పాత్రుడు, పద్మశ్రీ హేమంత్, వై అనురాధ, తులసీకృష్ణ, డాక్టర్ సీ ఉమామాధవి, అపర్ణాప్రసాద్, సంతోష్, భాగవతుల శైలజ వ్యవహరించారు.

అభివృద్ధే మా అజెండా

- మూడో సారి బడ్జెట్ ప్రవేశ పెట్టిన మేయర్ రాయన భాగ్యలక్ష్మి
- 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1382.54 కోట్లతో వీఎంసీ బడ్జెట్ ఆమోదం
- పన్నుల భారం లేని బడ్జెట్ : ఎమ్మెల్యే మల్లాది



మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు తాము నిరంతరం శ్రమిస్తున్నామని, గతంలో మాదిరి శంకుస్థాపనలు చేసి వదిలేయకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పనులు ప్రారంభించిన ప్రతి అభివృద్ధి పనిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో వీఎంసీ 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె బడ్జెట్ ప్రసంగం ఇచ్చారు. విజయవాడ నగరపాలక సంస్థలో వైఎస్సార్ సీపీ పాలన చేపట్టిన మూడేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, తాము అధికారం చేపట్టిన మూడేళ్ల కాలంలో ప్రజలపై ఎలాంటి పన్నుల భారం లేకుండా బడ్జెట్ సమర్పిస్తున్నామన్నారు.

బడ్జెట్ ఇలా..

2024-25 వార్షిక రివైజ్డ్ బడ్జెట్ మొత్తం రూ.1382.54 కోట్లుగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రవేశ పెట్టారు. రెవెన్యూ ఆదాయం రూ.820.90 కోట్లు, రెవెన్యూ ఖర్చు రూ.614 కోట్లు అంచనాలు రూపొందించగా ఈ బడ్జెట్ రూ.116 కోట్లు మిగులు బడ్జెట్ అని పేర్కొన్నారు. క్యాపిటల్ ఆదాయం రూ.501.42 కోట్లు, క్యాపిటల్ ఖర్చు రూ.773.53 కోట్లు, డిపాజిట్లు అడ్వాన్స్‌లు ద్వారా కార్పొరేషన్‌కు రూ.48.17 కోట్లు వస్తుంటే లోన్లు రీ పేమెంట్లకు రూ.18.12 కోట్లు నిధులు ఖర్చు చేయనున్నామని అన్నారు.

బడ్జెట్ ప్రసంగం ప్రధానాంశాలు

- కార్పొరేటర్లకు వార్డు అభివృద్ధి పనులకు బడ్జెట్‌లో రూ.20 లక్షలు నిధులు కేటాయింపులు వాటిని రూ.50 లక్షలు చేయాలని సభ్యుల నుంచి వచ్చిన ప్రతిపాదనపై సవరణ తీర్మానం చేశారు. ఒక్కో కార్పొరేటర్‌కు అభివృద్ధి పనుల నిమిత్తం రూ.40 లక్షలు మంజూరు చేస్తూ సవరణ తీర్మానం చేశారు.
- కార్పొరేషన్‌కు పన్నుల వల్ల రూ.349.99 కోట్లు, అసైన్డ్ రెవెన్యూ రూ.45.32 కోట్లు, టౌన్‌ప్లానింగ్ ఇతర ఆదాయాల ద్వారా రూ.68.43 కోట్లు, లైసెన్స్ ఫీజులు, అడ్మినిస్ట్రేషన్ చార్జీలు రూ.25.98 కోట్లు, అమ్మకాలు, అద్దెల ద్వారా రూ.3.22 కోట్లు, మార్కెట్ రెమ్యునరేటివ్ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా రూ.43.86 కోట్లు ఆదాయం సమకూరుతుంది. తాగునీటి సరఫరా, యూజీడీ పన్నుల ద్వారా రూ.81.55 కోట్లు, ఇతర ఆదాయాల ద్వారా రూ.202 కోట్లు ఆదాయం సమకూరుతుంది.
- ఇంకా రెవెన్యూ ఖర్చులో సిబ్బంది వేతనాలు రూ.209.70 కోట్లు, నిర్వాహణ ఖర్చుల నిమిత్తం రూ.198.87 కోట్లు ఖర్చు చేయనున్నారు. రిపేర్లు, నిర్వాహణ నిమిత్తం రూ.140.49 కోట్లు, అడ్మినిస్ట్రేటివ్ చార్జీలకు రూ.54.87 కోట్లు, ఇతర ఖర్చులు రూ.10.67 కోట్లు ఈ ఏడాది ఖర్చు చేయనున్నారు.
- క్యాపిటల్ ఆదాయంలో ఏపీ లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీమ్ ద్వారా రూ.1.5 కోట్లు, అర్బన్ రిఫార్మ్ నిధులు రూ.100 కోట్లు, కాలుష్య నియంత్రణ మండలి నుంచి రూ.25 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.60 కోట్లు ఆదాయం సమకూరనుంది.
- అమృత్ పథకం నుంచి రూ.96.57 కోట్లు మూడోదఫా నిధులు విడుదలవుతాయని, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.110 కోట్లు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 కోట్లు వీఎంసీకి విడుదలవుతాయి.
- క్యాపిటల్ ఖర్చులో రోడ్ డెవలప్‌మెంట్ అండ్ అప్‌గ్రేషన్ రూ.30.50 కోట్లు నిధులు ఖర్చు చేయనుండగా, మూడు సర్కిళ్లలో డివైడర్ల అభివృద్ధికి రూ.3.90 కోట్లు నిధులు కేటాయించారు. ఫుట్పాత్‌లు, టేబుల్ డ్రెయిన్ల అభివృద్ధికి రూ.15.41 కోట్లు, డ్రైనేజీ సంపుల నిర్మాణానికి రూ.5.75 కోట్లు, నీటి సరఫరా నిమిత్తం రూ.14 కోట్లు నిధులు కేటాయింపులు చేశారు.
- అమృత్ పథకం పనులకు రూ.96 కోట్లు, బుడమేరు అభివృద్ధికి రూ.16.81 కోట్లు, కాల్వగట్ల సుందరీకరణకు రూ.5 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 175 కోట్లు, ఫుడ్‌స్ట్రీట్ ఆధునికీకరణకు రూ.1.75 కోట్లు రిటైనింగ్‌వాల్ బ్యూటిఫికేషన్‌కు రూ.36.25కోట్లు, జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.15 కోట్లు నిధులు ఖర్చు చేయనున్నారు.

మేం చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధం..



వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో, వీఎంసీలో అధికారం చేపట్టాక శరవేగంగా నగరాన్ని అభివృద్ధి చేశామని, టీడీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధి మా పాలనలో పరుగులు తీస్తోంది. నగరాన్ని నలువైపులా సమాంతరంగా అభివృద్ధి చేస్తున్నాం. మేం చేసిన అభివృద్ధిపై..టీడీపీ నాయకులు చేసిన అవినీతిపై కౌన్సిల్లో చర్చకు సిద్ధామా..? అబద్ధాలు, అంకెలగారడీలు టీడీపీ నాయకులకు వెన్నతోపెట్టిన విద్య.

–మల్లాది విష్ణు, సెంట్రల్ ఎమ్మెల్యే

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ముత్యాలంపాడులోని గొట్టుముక్కల సూర్యనారాయణరాజు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో శనివారం శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం ఆధ్వర్యాన పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన అల్పాహారం పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ప్రతీ ఏటా పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న సంఘం సభ్యుల సేవలను కొనియాడారు. చదువుకు అదనంగా సమయం కేటాయించే విద్యార్థులు ఖాళీ కడుపుతో ఉండకూడదనే ఉద్దేశంతో అల్పాహారం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. దీంతో పాటు మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు గత 16 ఏళ్లగా నగదు ప్రోత్సాహకాలు అందిస్తుండటం హర్షణీయమన్నారు. ఉన్నత చదువులు చదవాలనుకునే విద్యార్థులకు పదో తరగతి తొలిమెట్టు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో తొలి ప్రాధాన్యం విద్యకే..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి ప్రాధాన్యతగా ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి పరిచే బాధ్యత తీసుకుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. క్వాలిఫైడ్ టీచర్లు, విశాలమైన తరగతి గదులు, చక్కని మరుగుదొడ్లు, ఫర్నీచర్‌తో తమ ప్రభుత్వంలో పాఠశాలలన్నీ విలసిల్లుతున్నాయని చెప్పుకొచ్చారు. ఇంగ్లిష్ మీడియాన్ని అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా 'అమ్మఒడి' పేరిట ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే విద్యార్థులకు అధునాతన వసతులు, విద్యాదీవెన కిట్లు, ట్యాబ్లు, స్మార్ట్ డిస్ ప్లేల ద్వారా ఆధునిక డిజిటల్ విద్యను అందించడం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగపరచుకుని ప్రతీ ఒక్క విద్యార్థి చదువులో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీఅల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయ సేవా సంఘం అధ్యక్షుడు కే సుబ్బరాజు, కార్యదర్శి పీవీ సుబ్బరాజు, ట్రెజరర్ టీ శ్రీనివాసరాజు, శ్రీఅల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌వీ సుబ్బరాజు, కార్యదర్శి కే ప్రసాద్‌రాజు, పాఠశాల హెచ్‌ఎం జే పుష్పలత, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, పట్టాభి రామరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు ఆర్‌యూబీ ప్రారంభిస్తాం



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఆర్‌యూబీని ఈ నెలాఖరులోపు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తామని ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు అన్నారు. ఆర్‌యూబీ పనులను శనివారం నగర పాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్‌యూబీ పనులు ప్రారంభించామని తెలిపారు. అయితే కోవిడ్, సాంకేతిక సమస్యల దృష్ట్యా ఆర్‌యూబీ పనులు కొంత మేర ఆలస్యం అయ్యాయన్నారు. కానీ తాము ఇచ్చిన మాట ప్రకారం ఆర్‌యూబీ పనులు పూర్తి చేసిన తర్వాతనే ఓటు అడుగుతామని అన్నారు. ఆర్‌యూబీ పనుల గురించి మాట్లాడే అర్హత టీడీపీ నేతలకు లేదన్నారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తమది చేతల ప్రభుత్వమని.. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని సూచించారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ సీఎం ప్రత్యేక నిధులు రూ. 17 కోట్లతో ఆర్‌యూబీ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే రూ. 9 కోట్ల మేర పనులు పూర్తయ్యాయని త్వరగా పనులు పూర్తి చేసి ఈ నెలాఖరుకు ఆర్‌యూబీని ప్రారంభిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ ఆర్‌యూబీ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, వైఎస్సార్ సీపీ 28, 31వ డివిజన్ల ఇన్‌చార్జ్‌లు కనపర్తి కొండ, పెనుమత్స సత్యం, పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ కంభం కొండలరావు, నగరపాలకసంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే సత్తా రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీకి లేదని తాము నాలుగు సంవత్సరాల పది నెలల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటు వేయాలని సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 27వ డివిజన్ బావాజీపేటలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరితో కలిసి వారు గడప గడపకు వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న పార్టీలన్నీ ఒక కూటమిగా వచ్చిన వైఎస్సార్ సీపీని ఏమీ చేయలేరని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎవరు మంచి చేస్తున్నారో చూడాలన్నారు. సెంట్రల్ నియోజకవర్గం సీటు గెలుపు కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ ప్రజల పార్టీ వైఎస్సార్ సీపీ అని.. ఎమ్మెల్యే మల్లాది విష్ణు నాయకత్వంలో ఎన్నికల బరిలో దిగామన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో 25 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తామని చెప్పారు. రాష్ట్రంలో సింగిల్‌గా పోటీ చేసే పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమే అని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన ఎవరితో పొత్తు పెట్టుకోవాలో తెలియక అయోమయంలో ఉన్నారని అన్నారు. సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో 175 నియోజకవర్గాల్లో అత్యధిక మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్ శ్రీశైలజ మాట్లాడుతూ బెజవాడ బ్రదర్స్ ఇద్దరూ ఎన్నికల శంఖారావం పూరించారని అన్నారు. ప్రతిపక్షాలకు డిపాజిట్లు కూడా రావని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు ఎంత అభివృద్ధి చేశారో టీడీపీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ నేతలకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బచ్చు మాధవీకృష్ణ, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

విదేశీ సిగరెట్లు స్వాధీనం

పడమట(విజయవాడ తూర్పు): విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు విజయవాడలో విదేశీ సిగరెట్లు దందాను శనివారం అడ్డుకున్నారు. అక్రమంగా నగరంలో వీటి విక్రయాలు జరుపుతున్న ముఠాపై అధికారులు కన్నేసి ఆటోనగర్‌లోని ఓ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు కంపెనీలో నిల్వచేసిన రూ.10 లక్షలు విలువ చేసే సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సిగరెట్లను పడమట పోలీస్ స్టేషనుకు తరలించారు. సీజ్ చేసిన సిగరెట్లు ప్రస్తుతం తమ పోలీస్ స్టేషన్ లోనే ఉన్నట్లు పటమట పోలీస్ స్టేషన్ సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట ఆంజనేయవాగు ప్రాంతానికి చెందిన దంపతులకు ఇద్దరు సంతాన. కుమార్తె (19) కేబీఎన్ కాలేజీలో డిగ్రీ చదువుతోంది. శుక్రవారం ఉదయం కాలేజీకి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. మధ్యాహ్నం కాలేజీ సిబ్బంది తండ్రికి ఫోన్ చేసి మీ అమ్మాయి కాలేజీకి రాలేదని చెప్పారు. సాయంత్రం ఇంటికి వచ్చిన కుమార్తెను తల్లి ఎక్కడికి వెళ్లావని ప్రశ్నించింది. కుమార్తె ఇంటిలోకి వెళ్లగా తల్లి సరుకుల కోసం బయటకు వెళ్లింది. అర్ధగంట తర్వాత ఇంటిలో కుమార్తె కనిపించకపోవడంతో ఆందోళన చెంది, పోలీసులకు తల్లి ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సీఎం వైఎస్ జగన్‌కు ఎన్‌ఎంఏ కృతజ్ఞతలు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయభాస్కర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో అమలులో ఉన్న ఆంధ్రా బోర్డ్ ఫర్ ఆయుర్వేద స్థానంలో ఏపీ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ ఏర్పాటుకు అనుమతి మంజూరు చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి నేషనల్ మెడికల్ అసోసియేషన్ (ఎన్‌ఎంఏ), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.వి.ఎస్.విజయభాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టం ఆఫ్ మెడిసిన్ యాక్ట్ 2020లో నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రంలో ఆంధ్రా బోర్డు ఫర్ ఆయుర్వేదిక్ అమలులో ఉందన్నారు. దీని స్థానంలో ఏపీ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ ఏర్పాటుకు అనుమతి మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో ఆయుర్వేద వైద్యులకు స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఏర్పాటుకు అవసరమైన విధివిధానాలపై ఇటీవల ఆయుష్ కమిషనర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంపై ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఆయుష్ వైద్యులను క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం పరిధిలోకి తీసుకురావడం కోసం ఆయుష్ కమిషనర్ ప్రతిపాదనలు పంపారని, అది ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. ఈ రెండు విషయాలు అమలులోకి వచ్చేటట్లు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం తరపున హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ కోరారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ వేముల భాను ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నేషనల్ హెల్త్ మిషన్ సహకారంతో నడిపిస్తున్న విలేజ్ క్లినిక్‌లలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌గా ఆయుర్వేదిక్ గ్రాడ్యుయేట్స్‌కు అవకాశం కల్పించాలని కోరారు. ఆయుర్వేదం ఆరోగ్య శ్రీ జాబితాలోకి చేర్చేటట్లు చూడాలని కోరారు. ఆయుర్వేద అభివృద్ధి, వైద్యుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ఎల్లప్పుడూ నేషనల్ మెడికల్ అసోసియేషన్ సహకరిస్తుందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి డా.బి. వెంకట రమణ, ఉపాధ్యక్షులు డా.బి.మురళీమోహన్, డా.ఏస్.మురళీధర్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు డా.జి.చిన్నరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి సూచించారు. కళాశాలలో ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో నగదు పురస్కారం అందుకున్న విద్యార్థి డీ వివేక్ అభినందన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో తమ కళాశాల విద్యార్థి వివేక్ పర్యావరణంలో మార్పులు–మానవ తప్పిదాలు అనే మోడల్ చేసి అందరినీ మెప్పించడంతో పాటు నగదు పురస్కారం అందుకోవడం కళాశాలకే గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో మహిళకు భరోసా

- సంతోషం వ్యక్తం చేస్తున్న డ్వాక్రా సంఘాలు
- ఆసరాతో అండగా ప్రభుత్వం



శారదాంబిక మహిళా గ్రూపు

పాయకాపురం(విజయవాడరూరల్): మాట తప్పని, మడమ తిప్పని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణ మాఫీ చేయడంతో మహిళలు ముక్త కంఠంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి జేజేలు పలుకుతున్నారు. స్థానిక 64వ డివిజన్ కండ్రికకు చెందిన శారదాంబికా మహిళా సంఘంలోని పది మంది మహిళలకు అక్షరాల ఏడు లక్షల 57 వేల 960 రూపాయల లబ్ధి చేకూరింది. ఈ మహిళా సంఘంలోని పది మంది సభ్యులు ఏడు లక్షల 57 వేల 960 రూపాయల రుణాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో తీసుకోవడం జరిగింది. మహిళా సంఘం రుణం తీసుకున్న నెల రోజులకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంఘాలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం శారదాంబికా మహిళా సంఘానికి సంబంధించిన రుణాన్ని నాలుగు దఫాలుగా రూ. 7,57,960 వైఎస్సార్ ఆసరా ద్వారా రుణమాఫీ చేయడం జరిగింది. సీఎం వైఎస్ జగన్ రుణమాఫీ చేయడంతో డ్వాక్రా గ్రూపు మహిళలు మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకోవడానికి తీర్మానం చేశారు.

సీఎం జగన్‌ను గెలిపించుకుంటాం



మహిళా సంఘాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రుణ మాఫీ చేయడం చాలా సంతోషంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకుంటాం.

కొత్తరెడ్డి వెంకటరమణ, మహిళా సంఘం ప్రెసిడెంట్

మహిళలు సిద్ధం



వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. మహిళలకు గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మేలు చేస్తున్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ప్రతీ మహిళా సంఘానికి లబ్ధి చేకూరింది.

పూలా లక్ష్మి, మహిళా సంఘం సెక్రటరీ